ఆర్టికల్

# పరీక్షలెవరికి?

-లాస్య

కాలానికీ, ఋతువులకూ, పళ్ళకూ, పంటలకూ, పూలకూ, పెళ్ళిళ్ళకూ, చివరికి జబ్బుల క్కూడా ఒక సీజన్ అంటూ ఉన్నట్లే మార్చి, ఏప్రిల్ వచ్చిందంటే చాలు పరీక్షల సీజన్ ప్రారంభమైనట్లే.

అసలు ఈ పరీక్షలెందుకు- ఏ ఉద్దేశ్యంతో నిర్వహిస్తున్నారు - నిర్వహణ చక్కగా సాగుతోందా. అనుకున్న లక్ష్యాలు సాధిస్తున్నామా- మరేమైనా లోపాలున్నాయా- ఉంటే ఏ స్థాయిలో వాటిని చక్కదిద్ద గలం ఇలా ప్రశ్నించుకుంటే జవాబులు దొరకడం మాట అటుంచి భారతంలో కర్ణుని మరణానికి కారకులైన వాళ్ళందరి గురించి కృష్ణ భగవానుడు అర్జునునికి చెప్పిన వైనం గుర్తుకొస్తుంది.

“ఈ పరీక్షలనేవి విద్యార్థుల ప్రతిభా పాటవాల్ని ప్రదర్శింపగలగాలే కాని, ధారణాశక్తిని కాదం”టూ విద్యావేత్తలందరూ ముక్తకంఠంతో ఎప్పటినుండో ఘోషిస్తూనే ఉన్నారు.

ప్రభుత్వం, అధికారులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు, సంఘం, చివరగా విద్యార్థులు ఇలా అందరూ యథాశక్తిగా, ఈ పరీక్షా విధానాన్ని పెడ దారిలో నడిపిస్తున్నారంటే సత్యదూరం కాదు.

డిటెన్షన్ పద్ధతి రద్దయిన నాడే విద్యాస్థాయి దిగజారుడుకు అంకురార్పణ జరిగిందంటే మన ప్రభుత్వం ఒప్పుకోదు.

ప్రతిరోజూ విద్యార్థి బడికి వచ్చిన సమయంలో ఏదో ఒకటి నేర్చుకుంటాడనే విషయాన్ని ప్రాతిపదికగా తీసుకున్న మాట వాస్తవమే ఐనా, ఈ ధోరణి వికటించి హాజరుకు మాత్రమే ప్రాధాన్యత పెరిగి పాఠ్యాంశాలకు తగ్గిందనే చెప్పొచ్చు.

ఇక సర్టిఫికెట్లు అంగడిలో వస్తువులు కొన్నంత తేలికైపోయింది. పేపర్లలో నెంబర్‌రానివారు పాస్ మెమోలు తెచ్చుకుంటున్న విషయం మనకు తెలియందికాదు.

ఈ పరీక్షల మహాయజ్ఞంలో అధికారులు ప్రధాన పాత్రధారులు. సమర్థతను గుర్తించకుండా విధి నిర్వహణలను అప్పగించడం. కారణం లేకుండా కేంద్రాలను మార్చడం, నిజాయితీ పరులను ఇబ్బందులకు గురిచేయడం మొదలైనవి చూస్తూంటే 'కంచే చేను మేస్తే-' అన్న నానుడి గుర్తుకి వస్తుంది.

ప్రభుత్వం ప్రకటించే పారితోషికాల కోసమైతేనేమి, నవోదయ, రెసిడెన్షియల్ పాఠశాలల ప్రవేశానికైతేనేమి, పెరుగుతున్న పోటీని తట్టు కునేందుకు తమ పిల్లల్ని తయారు చేయడానికి తల్లిదండ్రులెన్నుకున్న మార్గాల్ని చూస్తూంటే ఆశ్చర్యంతో, పాటు అసహ్యం కూడా కల్గుతుంది.

ట్యూషన్‌కి పంపిస్తే చాలు మిగిలిన తతంగ మంతా ఆ అయ్యవార్లే చూసుకుంటార్లే అని కొందరు అనుకుంటారు. టెక్స్ట్ బుక్స్ కొనివ్వని తల్లి దండ్రులుంటారేమోగాని గైడ్స్ కొనుక్కోవటానికి డబ్బులేదనే వారు మాత్రముండరు.

అంతేకాదు... ఏ స్కూలునుండి ఫీజుకడ్తే ఏ కేంద్రంలో పరీక్షలు రాయొచ్చో, ఎవరెవరు పర్యవేక్షకులుగా ఉన్నారో...ఇలాంటి ఆరాలు తీయడం వీలుకాని పక్షంలో రాసిన పరీక్షా పత్రాలు ఎక్కడికి వెళ్ళాయో కనుక్కోవడానిక్కూడా వెను దీయరు! నిజానికి పరీక్షలు రాసే వారికన్నా ఇలాంటి తల్లి దండ్రులే టెన్షన్ ఎక్కువగా ఫీలవుతూ ఉంటారు.

ఒక స్కూల్లో పాఠాలు నేర్చుకొని, మరొకచోట ఫీజుకట్టించడం పరీక్ష హాల్లో నెంబర్లని కూడా లాంగ్‌జంప్ చేయించడం. చిన్నచిన్న కరపత్రాల సరఫరా, ఎడిషనల్స్ ఎక్కువగా తీసుకొని జవాబులు రాసిన విద్యార్థి పేపర్లోంచి అడిషనల్స్ తీసి వేరే విద్యార్థుల పేపర్లకి కట్టడం, సామూహిక విరాళాలను సేకరించి పార్టీలు చేసుకోవడం... చెప్పాలంటే... ఇలా ఎన్నెన్నో!

విద్యార్థులను శ్రమించడాన్ని మరచిపోయేలా చేస్తూ వాళ్ళని అడ్డదారులు తొక్కేలా చేస్తున్నామన్న విషయం ఎవరికి వారు ఆత్మవిమర్శ చేసుకొనే పరిస్థితి ఆసన్నమైంది.

చివరగా ఒకమాట.

అలా అని... అందరూ అవినీతి పరులేనా అని ప్రశ్నిస్తే కాదనే చెప్పాలి. ఎందుకంటే... తాము నమ్మిన సిద్ధాంతాలకై శ్రమించే చిత్తశుద్ధి, నిజాయితీ పరులైన అధికారులు, అధ్యాపకులు, తల్లిదండ్రులున్నారు కాని వాళ్ళను వేళ్ళపై లెక్కించొచ్చు.

అవినీతి దుమారంలో వాళ్ళు కొడికట్టిన దీపాలవుతున్నారు. ఈ వికారపు పొకడల మధ్య మబ్బు కమ్మిన సూర్యులవు తున్నారు.

అన్ని స్థాయిలలో ఈ దురవస్థలు దూరమైనపుడే ఈ వ్యవస్థ బాగుపడుతుంది అదే జరిగిన నాడు మనందరం కోరుకునేందుకేముంటుంది?

-లాస్య

ఇ.నం.5-4-27, క్లబ్‌రోడ్,
కామారెడ్డి - 503 11.

కథ

# బడ్జెట్

సి.హెచ్.మధు.

**పక్షం రోజులు విదేశాలు వెళ్ళిన ముఖ్యమంత్రి స్వదేశం తిరిగి వచ్చాడు! విమానం దిగగానే విలేఖరులు చుట్టు ముట్టి రాష్ట్రంలో రాజకీయాల గురించీ, ప్రజల ఆందోళనల గురించీ ప్రశ్నల వర్షం కురిపించారు.**

అది జులై నెల...మొదటి వారం...

ప్రజలు రకరకాల ఆందోళనలు చేస్తోన్నరోజులు.

“ఎరువుల ధరలు తగ్గించాలని రైతులు కోరుతున్నారు” విలేఖరులు అడిగారు.

“ఏం చేస్తాం...బడ్జెట్ లేదండీ! ముఖ్యమంత్రి జవాబు చెప్పాడు.

“విద్యార్థులు పాఠ్యపుస్తకాలు ఇప్పించాలని ఆందోళన చేస్తున్నారు” మరో విలేఖరి చెప్పాడు.

“బడ్జెట్ లేదండి!”

“రైతులు చెరువులకు మరమ్మతు చేయించాలని డిమాండ్ చేస్తున్నారు సార్”

“బడ్జెట్ లేదండి!”

తోటి విలేఖరులడిగిన ప్రతి ప్రశ్నకూ 'బడ్జెట్ లేద'నే సమాధానం వింటూ వచ్చిన మరో విలేఖరి ముఖ్యమంత్రిని సూటిగా అడిగాడు.

“అన్నిటికీ బడ్జెట్ లేదంటున్నారు...మరి బడ్జెట్ వేటికుందో చెప్పగలరా?”

విలేఖరి కొంటె ప్రశ్నకు ముఖ్యమంత్రి నవ్వి...

“ఉద్యోగుల జీతభత్యాలకుంది. పోలీసుల సంఖ్యనూ, పోలీస్ స్టేషన్ల సంఖ్యనూ పెంచటానికుంది. మంత్రుల ప్రయాణాలకూ...వాళ్ళ రక్షణకూ ఉంది.”

“మరి విదేశీ ప్రయాణాలకో?” మరో విలేఖరి ప్రశ్న.

“బడ్జెట్ తప్పక ఉంటుంది! మీకు తెలీదేమో... పదవి దొరికాక...మా దీర్ఘకాల రోగాలకు ప్రభుత్వ డబ్బుతో విదేశాల్లో ఆపరేషన్లు చేసుకోవడానిక్కూడా బడ్జెట్ ఉంటుంది!” నవ్వుతూ అన్నాడు ముఖ్యమంత్రి.